# సంక్షేమ పథకాలే ప్రభుత్వానికి అండ



తిర్మలాపూర్‌లో జీపీ, డ్వాక్రా భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం

- పని చేసే నాయకులను ప్రజలు ఆదరించాలి
- అర్హులందరికీ పక్కా ఇండ్లు ఇస్తాం
- గృహలక్ష్మి పథకానికి రూ.12వేల కోట్లు కేటాయింపు
- 'డబుల్' ఇండ్ల మంజూరుకు ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దు
- సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి
- వర్నిలో 1434మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాల అందజేత
- తిర్మలాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులను ప్రారంభించిన స్పీకర్

బాన్సువాడ రూరల్/ వర్ని, అక్టోబర్ 7 : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. సంక్షేమ పథకాలే సర్కారుకు అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. శనివారం ఆయన బాన్సువాడ మండలం తిర్మలాపూర్ గ్రామంలో రూ. 2.53 కోట్ల అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. వర్ని మండల కేంద్రంలోని సీసీడీలో వర్ని, చందూర్, మోస్రా, రుద్రూరు, కోటగిరి, పొతంగల్ మండలాలకు చెందిన 1434మంది లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూ.85వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని తెలిపారు. కాళేశ్వరం నీటిని నిజాం సాగర్ ప్రాజెక్టులోకి తీసుకొచ్చి రెండు పంటలకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో సాగు నీటికి ఎలాంటి ఢోకాలేదన్నారు. పేదలకు విద్య, వైద్యం పూర్తిస్థాయిలో అందాలని బాన్సువాడ నియోజకవర్గంలో దవాఖానలు, గురుకుల పాఠశాలల ఏర్పాటుకు కృషి చేసినట్లు చెప్పారు. కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. తిర్మలాపూర్ గ్రామానికి పదేండ్లలో సంక్షే మ పథకాలకు రూ.16.37 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.11.54 కోట్లు నిధులు ఖర్చు చేశామని వివరించారు. నిరుపేదలకు పక్కా ఇండ్లు నిర్మించాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ గృహలక్ష్మి పథకం కోసం బడ్జెట్‌లో రూ.12వేల కోట్లు కేటాయించారని తెలిపారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల మంజూరు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వ వద్దని సూచించారు. సుపరిపాలన అందిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, సర్పంచ్ జిన్నరఘురామయ్య, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ దుద్దాల అంజిరెడ్డి, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యులు దొడ్ల నీరజారెడ్డి, పద్మాదారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ భూషణ్‌రెడ్డి, బుడ్మి సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం, ఎంపీడీవో సత్యనారాయణ రెడ్డి, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు ఎర్వాల కృష్ణారెడ్డి, రైతుబంధు సమితి గ్రామ అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మైనార్టీ బంధు చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

- గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య
- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్
- కామారెడ్డిలో మైనార్టీ బంధు చెక్కుల పంపిణీ

కామారెడ్డి, అక్టోబర్ 7 : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని విప్ గంపగోవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కళాభారతిలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 620 మంది మైనార్టీలకు లక్ష రూపాయల చొప్పున 6 కోట్ల 20 లక్షల చెక్కులను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌తో కలిసి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. పేదల కన్నీళ్లు తెలిసిన సీఎం కేసీఆర్ ఏదో ఒక పథకంతో వారికి లబ్ధి చేకూరుస్తూ ఊరటనిస్తున్నారని అన్నారు. ఈ తొమ్మిదిన్నరేండ్లలో అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఇంటికీ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. మైనార్టీలకు పూర్తిగా గ్రాంట్ రూపంలో అందించే లక్ష రూపాయలతో ఏదేని అనుభవమున్న వ్యాపార రంగంలో పెట్టుబడి పెట్టి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కుటుంబాన్ని పోషించడంతోపాటు పిల్లలను బాగా చదివించాలన్నారు. నేటి కాలంలో ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగితేనే సమాజంలో రాణిస్తున్నారని గుర్తించిన ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నదని తెలిపారు. ఉన్నత చదువుల కోసం విదేశీ విద్యా పథకం కింద పేద విద్యార్థులకు రూ. 20 లక్షలు అందజేస్తున్నదని చెప్పారు. పేదల సంక్షేమం కోసం పని చేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, మాచారెడ్డి ఎంపీపీ నర్సింగరావు, జిల్లా మైనార్టీ అధికారి దయానంద్, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# సేవాగుణాన్ని కలిగి ఉండడం వరం

**మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రావు**

ఖలీల్‌వాడి, అక్టోబర్ 7 : మానవత్వంతో సేవ చేసే గుణాన్ని కలిగి ఉండడం గొప్ప వరమని మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్‌రావు అన్నారు. జడ్పీ కార్యాలయంలో బీఎన్ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 1.30 లక్షలతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్లు ప్రజల ప్రాణాలను కాపాడడంతో పాటు సేవాగుణాన్ని కలిగి ఉండాలన్నారు. సేవ రాజకీయ నాయకులే కాకుండా మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ చేయవచ్చని అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషిచేస్తున్నారన్నారు. జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడుతూ.. డాక్టర్‌గా బీఎన్‌రావు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. కొవిడ్ సమయంలో చాలా మందిని అప్రమత్తం చేసి, వివిధ సేవలు అందించారని కొనియాడారు. అనంతరం బీఎన్‌రావును జడ్పీచైర్మన్‌తో పాటు ఐఎంఏ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు నీలిరాంచందర్, డాక్టర్ విశాల్, డాక్టర్ కిరణ్ మాదాల, వినియోగదారుల సమాచార కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు మాయవార్ రాజేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు బుచ్చన్న, గోపాల్‌రెడ్డి, అంజయ్య, నీలంరెడ్డి, శేఖర్ రాజ్, మనోహర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎన్ రావు

# ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు



ఆత్మకూర్‌లో రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

- నియోజకవర్గంలో రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- నాగిరెడ్డిపేట, సదాశివనగర్ మండలాల్లో పలు అభివృద్ధి పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి, అక్టోబర్ 7: ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నదని తెలిపారు. శనివారం ఆయన నాగిరెడ్డి పేట మండలంలోని పలు గ్రామాల్లో జీపీ భవనాలు, తారు రోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. సదాశివనగర్ మండల కేంద్రంతో పాటు అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన, భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మాట్లాడుతూ.. అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. 60 ఏండ్లలో చేయని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో చేసి చూపించారన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని గిరిజన గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేశారని, త్వరలో పనులను ప్రారంభిస్తామన్నారు. నియోజక వర్గంలో ఇప్పటి వరకు వందల కోట్ల రూపాయలతో పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కాశీ నారాయణ, జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, నాయకులు వెంకట్ రెడ్డి, రాజిరెడ్డి, మురళి, గుర్రాల సిద్ధయ్య, పలు గ్రామాల సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కే జై కొడుతున్న జనం



పార్టీలో చేరిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- అభివృద్ధి, సంక్షేమానికి ఆకర్షితులై గులాబీ పార్టీలో చేరికలు
- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్/ మాక్లూర్, అక్టోబర్ 7: రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు బీఆర్ఎస్‌కే జైకొడుతున్నారని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జిరాయత్‌నగర్ కాలనీకి చెందిన భవానీ గంగాపుత్ర సంఘం,పెర్కిట్ తర్ప పద్మశాలీ సంఘం, మామిడిపల్లి తర్ప పద్మశాలీ సంఘం, పెర్కిట్ నాయీ బ్రాహ్మణ సంఘ సభ్యులు, జర్నలిస్టు కాలనీ మాల సంఘం ప్రతినిధులు, వెల్మల్ గ్రామానికి చెందిన మున్నూరుకాపు, యాదవ సంఘ సభ్యులు, దత్తాపూర్ బంజార సేవా సంఘ సభ్యులు, ఆర్మూర్ మేస్త్రి సంఘం, ధొంకేశ్వర్‌లోని శ్రీలక్ష్మి మహిళా సంఘం, గద్వాల్ క్యాంప్ బీసీ సంఘం సభ్యులు, దేగాం మాదిగ సంఘ సభ్యులు జీవన్‌రెడ్డికి మద్దతుగా శనివారం ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానాల కాపీలను జీవన్‌రెడ్డికి అందజేసి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాక్లూర్ మండలంలోని అడవిమామిడిపల్లి, వడ్డెరకాలనీ, మామిడిపల్లి తండాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు కల్పిస్తామన్నారు. సీఎం కేసీఆర్ వద్ద సాన్నిహిత్యంతో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తీసుకువస్తున్నట్లు చెప్పారు. రూ3వేల కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు.